మత్తు పదార్థాల మహమ్మారిని తరిమికొట్టాలి

డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: మత్తు పదార్థాల మహమ్మారిని తరిమికొట్టేందుకు పోలీసులకు ప్రజలు సహకార మందించాలని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఓ హోమ్‌లో పట్టణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్‌పై, మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరించారు. చిన్న వయస్సులోనే మత్తు పదార్థాలకు యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గుడివాడ సబ్ డివిజన్‌లో ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు జరిగితే ఆయా ప్రాంతాల్లో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం క్రమశిక్షణతో ఆటో నడుపుతూ కష్టపడి పిల్లలను చదివించుకుంటున్న ఆటో డ్రైవర్లను ప్రోత్సహించేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో బీటెక్ మొదటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్ల పిల్లలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను డీఎస్పీ అందించారు. కార్యక్రమంలో వన్, టూటౌన్ సీఐలు ఎల్.రమేష్, నాగదుర్గారావు, ట్రాఫిక్ ఏఎస్ఐ రత్నరాజు పాల్గొన్నారు.


ఆటోడ్రైవర్ కుమార్తెకు ప్రోత్సాహకం అందజేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

మాదక ద్రవ్యాల వాడకం నేరం

కైకలూరు: మాదక ద్రవ్యాలను వినియోగిస్తే కఠిన శిక్షలకు గురికావల్సి వస్తుందని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌పీ లక్ష్మి తెలిపారు. స్థానిక విద్యాంజలి డిగ్రీ కాలేజీలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధక చట్టాలను విద్యార్థులకు వివరించారు. ముందుగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలుపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన ఎండీ కర్షనా ప ర్వీన్, బి.సాయి సుమాంజలి, లహరికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జడ్జి అందించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ డ్రగ్స్‌ను తీసుకునే మోతాదును బట్టి శిక్షలు, జరిమానాలు ఉంటాయన్నారు. రూ.లక్ష నుంచి రూ.2 లక్షలతో పాటు 10 నుంచి 20 ఏళ్ల కారాగారశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం మత్తునకు బానిసలైన వ్యక్తులకు పరివర్తన పునరావాస కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు. న్యాయవాది పి.పవన్‌కాంత్ వివిధ చట్టాలను వివరించారు. ప్రిన్సిపాల్ జమిల్ సయ్యద్, న్యాయవాది చింతపల్లి జయప్రకాష్, పారా లీగల్ వలంటీర్లు రాంబాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

డీవైఈఓ పద్మారాణి

తోట్లవల్లూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఐ.పద్మారాణి పేర్కొన్నారు. మండలంలోని వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాలకు మురాల ఇందిర సహకారంతో సన్‌రైజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 27 వేల విలువైన స్పోర్ట్స్ కిట్‌ను దాతలు సోమవారం అందజేశారు. డీవైఈఓ పద్మారాణి చేతుల మీదుగా దాతలు స్పోర్ట్స్ కిట్‌ను ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహకారం వినియోగించుకుని విద్యార్థులు ఆటల్లో ప్రతిభ కనబరచి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. ఎంఈఓ జి. వెంకటేశ్వరరావు, ఏంఈఓ-2 సురేష్, పాఠశాల హెచ్‌ఎం స్వరాజ్యలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ కొడాలి మణి, సన్‌రైజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు దాసరి సీతారాం, ప్రతినిధులు మణికంఠ, హరికృష్ణ, వాకా రవి కొండలు, సింహాద్రి శ్రీనివాసరావు, రాజేష్, వినయ్‌బాబు, చిట్టిబొమ్మ శ్రీనివాస్, జోగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


డీవైఈఓ పద్మారాణికి స్పోర్ట్స్ కిట్‌ను అందజేసిన సన్‌రైజ్ ఫౌండేషన్ ప్రతినిధులు

గుడివాడ చానల్లో గుర్రపుడెక్క తొలగింపు

సాక్షి స్పందన

గుడివాడరూరల్: గుడివాడ చానల్లో పూడికతీత పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గుడివాడ చానల్లో తూడు, గుర్రపుడెక్క మేట వేసి నీరు సక్రమంగా ప్రవహించక పోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారంటూ ఈ నెల 25వ తేదీన సాక్షిలో వెలువడిన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్ చానల్లో ఉన్న గుర్రపుడెక్క, తూడు, నాచు తొలగింపు పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. డ్రోన్ల ద్వారా చానల్లో ఉన్న తూడు తొలగింపునకు క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. పనులు చేపట్టేందుకు కథనాన్ని ప్రచురించిన సాక్షికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.


చానల్లో తూడు, డెక్క తొలగింపునకు డ్రోన్ల ద్వారా మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి


తోట్లవలూరు మండలం బొడ్డపాడులో భోజనం వడ్డిస్తున్న సర్పంచ్ శివశంకర్


పసలపూడి ఎంపీపీ స్కూల్లో భోజనం వడ్డిస్తున్న సర్పంచ్ కృష్ణారావు దంపతులు

తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకరరావు పేర్కొన్నారు. మండలంలోని బొడ్డపాడు ఎంపీయూపీ పాఠశాల్లో శుభదిన్ భోజన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు శివశంకరరావు భోజనం వడ్డించటంతోపాటు అన్నదాత అగ్నిహోత్రం శ్రీనివాసమూర్తిని సన్మానించారు. ఉపాధ్యాయుడు నాగబాబు విద్యార్థులకు పెన్సిళ్లు, చాకుమర్లు అందజేశారు. హెచ్‌ఎం జయరాజు, ఉప సర్పంచ్ శివశంకర్, సచివాలయ ఉద్యోగులు మణికంఠ, భువనేశ్వరి, ఉపాధ్యాయులు సుమలత, సత్యలక్ష్మి, దేవి, హేమలత, రిబిక పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్లో శుభదిన భోజనం

మండవల్లి: పసలపూడి మండల ప్రాథమిక పాఠశాలలో సోమవారం శుభదిన భోజనం కార్యక్రమం నిర్వహించారు. పసలపూడి సర్పంచ్ ఉచ్చుల కృష్ణారావు, మాజీ సర్పంచ్ నిర్మల దంపతుల ఆర్థిక సాయంతో పౌష్టికాహారం తయారు చేయించి స్వయంగా పిల్లలకు వడ్డించారు. హెచ్‌ఎం వై సత్యనారాయణ, ఉపాధ్యాయిని కె.సునీత, సీఆర్పీ ప్రియాంక పాల్గొన్నారు.

అయ్యవారిరుద్రవరంలో..

మండవల్లి: అయ్యవారిరుద్రవరం హరిజనవాడ మండల ప్రాథమిక పాఠశాల్లో సోమవారం తిథి భోజనం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం ఆర్థిక సాయంతో విద్యార్థులకు భోజనంతోపాటు అరటి పండు వడ్డించారు. హెచ్‌ఎం సీహెచ్ పిచ్చియ్య, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు డి రమేష్, ఉపాధ్యాయురాలు జయశ్రీ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: శిక్షా సప్త విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చివరి రోజు శుభ దిన్ భోజనాలు ఉత్సాహంగా సోమవారం నిర్వహించారు. రోజువారీ మెనుతో పాటు దాతల సాయంతో స్వీట్లు, పండ్లను విద్యార్థుల భోజనాల్లో వడ్డించారు. కైకలూరు మండలం వేమవరప్పాడు, శ్రీరంగాపురం పాఠశాల్లో విద్యార్థులకు గ్రామానికి చెందిన విశ్రాంత పంచాయతీ సెక్రటరీ అడవి ప్రసాద్ సాయంతో భోజనాలు వడ్డించారు. హెచ్‌ఎంలు చంద్రశేఖర్, శ్రీకిరణ్ పాల్గొన్నారు. కలిదిండి మండలం ఆరుతెగళపాడు పాఠశాలలో కామినేని గోపాల్, విజయ్‌కుమార్, మాజీ సైనికుడు జంగం డేవిడ్‌రాజు, కాళ్లపాలెం సర్పంచ్ కనకలింగేశ్వరరావు సాయంతో పండ్లు, స్వీట్లు అందించారు. శీతనపల్లికి చెందిన కట్టా వీరరాఘవు ఆర్థిక సాయంతో విద్యార్థులకు పుస్తకాలు అందించారు.

పామర్రులో..

పామర్రు: తిథి భోజనం శిక్షా సప్తాహ్(శుభ్ దిన్ భోజన్) కార్యక్రమం స్థానిక ఆర్‌హెచ్‌జీ నగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్ వెంకటరత్నాలు మాట్లాడుతూ దాత నిమ్మకూరు గురుకుల పాఠశాల్లో గణిత ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు ఆర్థిక సాయంతో తిథి భోజనం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు విజయకుమారి, శాంతి అంకరవి, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా-సప్తాహ కార్యక్రమంలో భాగంగా శుభదిన (తిథి) భోజనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ భోజనం ఏర్పాటుకు పలు గ్రామాల్లో దాతలు ముందుకు రాగా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే సొంతంగా నిర్వహించారు. వాడవల్లి యూపీ స్కూల్లో సర్పంచ్ సుధాబత్తుల రమణ విద్యార్థులకు స్వీట్లు, చికెన్‌కర్రీ, పచ్చళ్లతో ప్రత్యేక భోజనాన్ని ఏర్పాటు చేశారు. వైవాక యూపీస్కూల్లో విద్యార్థులకు స్వీట్లు, పండ్లతో ఉపాధ్యాయులు భోజన ఏర్పాట్లు చేశారు.


అయ్యవారిరుద్రవరం ఎంపీపీ స్కూల్లో తిథి భోజనంతో విద్యార్థులు


పామర్రులో తిథి భోజనం చేస్తున్న విద్యార్థులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెదపారుపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరకావాలని కోరారు.

రేపు ఉపాధిహామీ ప్రజావేదిక

గుడివాడరూరల్: ఉపాధిహామీ పథకం పనులపై ఈ నెల 31వ తేదీన ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫలితాల విశ్లేషణకు ఈ నెల 31న స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సమన్వయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తోట్లవల్లూరు: కుమార్తె అదృశ్యంపై తల్లి పోలీసులను ఆశ్రయించిన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. గ్రామానికి చెందిన గొల్లపల్లి కృపాబాయమ్మ కుమార్తె మల్లీశ్వరికి ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామానికి చెందిన తలకటూరి సురేష్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త సురేష్‌తో మనస్పర్థల కారణంగా ఆమె ఐదు నెలలుగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నెల 15వ తేదీ రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి కృపాబాయమ్మ కుమార్తె అదృశ్యంపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిరాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.

'పరువు నష్టం నోటీసులు పంపించాం'

కైకలూరు: ప్రజాబలంతో విజయం సాధించిన తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న వార్డు సభ్యులకు పరువు నష్టం నోటీసులు పంపించానని కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి సోమవారం తెలిపారు. గ్రామ పంచాయతీలో నిధులు లేక పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అటువంటిది సర్పంచ్ తన వ్యక్తిగత ఖాతాలో రూ.1.84 కోట్లు జమ చేసుకున్నారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేసిన వార్డు సభ్యులు వాటిని నిరూపించాలని డిమాండ్ చేశారు.

తహసీల్దార్ బదిలీ

మొవ్వ: మండల తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాకినాడ ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారిగా విధులు నిర్వర్తించిన ఆమె ఫిబ్రవరి 5న మొవ్వ మండలానికి వచ్చారు. మొవ్వ డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ గోపాలరావుకి సోమవారం బాధ్యతలు అప్పగించి ఆమె రిలీవ్ అయ్యారు.

రాష్ట్రంలో ఆటవిక అరాచక పాలన

మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తుంటే మొత్తంగా ఒక ఆటవిక, ఆరాచక పాలన కనిపిస్తోందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టకుండా మరో మూడు నెలలు ఓటాన్ అకౌంట్‌కు వెళ్లిందన్నారు. రాష్ట్రం మొత్తం బడ్జెట్ ఎంత? అందులో ఆదాయాలు ఎంత? ఖర్చులు ఎంత? రాష్ట్రానికి ఉన్న రుణం ఎంత? ఏయే శాఖలకు ఎంత? ఏయే పథకాలను ఎంత ఖర్చు వంటి వివరాలు చెప్పాల్సి వస్తుందని ఈ ఎత్తుగడకు పాల్పడ్డారన్నారు. ఏడు నెలల పాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళ్లడం బహుశా ఎప్పుడూ జరగలేదన్నారు. చంద్రబాబు ఎప్పుడు ఏమి చేసినా డైరెక్ట్‌గా చేయడు.. పాలిటిక్స్ అయినా అంతే, పాలన అయినా అంతే... అంతా వెనుక నుంచే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చంద్రబాబు తన మీడియా శక్తులతో కలిసి ఈ విధంగా చేస్తారన్నారు. ఒక పార్టీని టార్గెట్ చేయాలన్నా, ఒక కుటుంబాన్ని టార్గెట్ చేయాలన్నా ఈ రకంగా చేసుకుంటూ పోతారని అన్నారు. ఈ 50 రోజుల్లో కూడా చంద్రబాబు చేస్తున్నది ఇదే అని తెలిపారు.

అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాం..

2019 మే 30న వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే సరికి అప్పటికీ రాష్ట్ర ఖజానాలో ఉన్నది కేవలం రూ.100 కోట్లు, అంతటి కష్టం ఉన్నా కూడా ఆ సంవత్సరం అంటే 2019 జూలై 5న పూర్తి స్థాయి బడ్జెట్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెటితే కేవలం వారం రోజుల్లోనే జూలై 12న రాష్ట్రంలో ఇక్కడ తాము బడ్జెట్ ప్రవేశ పెట్టామని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన జూన్ 12కు సరిగ్గా రెండు రోజుల ముందు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.5,655 కోట్లు వచ్చాయన్నారు. మొత్తంగా రూ.7 వేల నుంచి రూ.8 వేల కోట్లు అందుబాటులో అప్పటికే ఉన్నాయన్నారు. ఇంత వెసులుబాటు ఉన్నా చంద్రబాబు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టడం లేదన్నారు. కారణం వాగ్దానాల నుంచి తప్పించుకుని ప్రజలను మోసగించే పన్నాగం ఇది అన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగం..

తమను ప్రజలు ఎవరూ ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని అనిల్‌కుమార్ ఆరోపించారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతోందన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉంటే ఈ సారికి అమ్మ ఒడి వచ్చేదని, పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికీ ఈ పథకం కింద నాలుగేళ్ల కాలంలో రూ.26,067 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం జూన్‌లో ఇవ్వాల్సిన ఈ పథకం ఇంత వరకు ఇవ్వలేదాన్నరు. ఈ పథకాన్ని తల్లికి వందనంగా పేరుమార్చి ఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు ఇస్తామని అన్నారు. అయితే ఒక్కరికే ఇస్తామన్న జీఓను మాత్రం ఇప్పటికీ మార్చలేదన్నారు.


పామర్రు కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్ పరామర్శ

కైకలూరు: మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) నియోజకవర్గంలో పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుల బంధువులను సోమవారం పరామర్శించారు. కలిదిండి మండలం పెదలంకలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇమ్మానేని రాము తల్లి వెంకటరత్నమ్మ, ఇమ్మానేని కోటేశ్వరరావు భార్య అహల్యకుమారిని పరామర్శించారు. అదే గ్రామంలో ఇటీవల మరణించిన పోకల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కైకలూరు మండలం రాచపట్నంలో సాయల శ్యామలరాజు తండ్రి వీరాస్వామి మరణించారు. ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సర్పంచ్ మంగారావు, మాజీ కలిదిండి మార్కెట్ యార్డు చైర్మన్ అయినాల బ్రహ్మాజీ, నాయకులు ఈదా లక్ష్మణరావు, మురళీకృష్ణ, దుగ్గిరాల ఆంజనేయులు పాల్గొన్నారు.


పెదలంకలో వెంకటరత్నమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

చేపల చెరువుల వేలం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లయ్యచెరువు, ఎర్రచెరువుల్లో 2024-25 నుంచి 2026-27 వరకు చేపలను పట్టుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి జిటివి. రమణ సోమవారం వేలం పాటను నిర్వహించారు.

పుల్లయ్య చెరువును మూడు లక్షల 24వేల రూపాయలకు ఆవల కోటయ్య వేలం పాడగా, ఎర్రచెరువును రెండు లక్షల 26వేల రూపాయలకు పలగాని యేసుబాబు వేలం పాట పాడారు. వేలం మొత్తాన్ని చెల్లించేలా షరతులకు లోబడి నిర్వహించారు. బహిరంగ వేలంలో గ్రామస్తులు యర్కారెడ్డి నాగిరెడ్డి, యర్కారెడ్డి కోటిరెడ్డి, మాదు శివరామ ప్రసాద్, దేవులపల్లి సతీష్, గుంటక సుబ్బారెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్‌షెల్టర్


మండవల్లిలో శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్

మండవల్లి: బస్‌షెల్టర్ శిథిలావస్థలకు చేరి, ప్రయాణికులు కాలు మోపడానికి వీలులేని పరిస్థితి మండవల్లిలో నెలకొంది. గతంలో గుడివాడ ఆర్టీసీ అధికారులు స్థానిక మంచినీటి చెరువు గట్టుపై బస్‌షెల్టర్ నిర్మించారు. గుడ్లవల్లేరు, కైకలూరు, గుడివాడలోని ఇంజినీరింగ్, డిగ్రీ తదితర కళాశాలకు వెళ్లే విద్యార్థులు, పలు ఊర్లకు వెళ్లే ప్రయాణికులు బస్సు వచ్చే వరకు ఈ బస్‌షెల్టర్‌లో వేచి ఉండేవారు. ఈ బస్‌షెల్టర్ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతింది. శ్లాబ్ పగుళ్లు రావడంతో పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. వర్షం నీరు శ్లాబ్ నుంచి లీకేజీ అవుతుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎండ కూడా షెల్టర్ లోపలకు రావడంతో కనీసం కూర్చోవడానికి సైతం అవకాశం లేదు. ప్రయాణికులు రోడ్డుపైనే బస్సు వచ్చే వరకూ వేచి ఉంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బస్‌షెల్టర్‌ను అభివృద్ధి చేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్‌షెల్టర్‌ను అభివృద్ధి చేయాలి

బస్‌షెల్టర్ పూర్తిగా దెబ్బతింది. కనీసం ప్రయాణికులు కూర్చోవడానికి కూడా అవకాశం లేదు. ప్రయాణికులకు ఉపయోగపడని బస్‌షెల్టర్‌తో ప్రయోజనం లేదు. వెంటనే అధికారులు మరమ్మతులు చేపట్టి బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తేవాలి.

– మన్నేపల్లి ఆదాం, వైఎస్సార్ సీపీ నాయకుడు, మండవల్లి

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగాధరరావు తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు విధిగా పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



తోట్లవల్లూరు: ఇసుక అక్రమ రవాణకు పాల్పడుతున్న ట్రాక్టర్ పోలీసులకు పట్టుబడిన ఘటన మండలంలోని వల్లూరుపాలెంలో జరిగింది. ఉంగుటూరు మండలం మానికొండ గ్రామానికి చెందిన వెంట్రప్రగడ సురేంద్ర, సగ్గుర్తి రవీంద్రబాబు కలిసి వల్లూరుపాలెం నుంచి ట్రాక్టర్‌తో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ పి.విశ్వనాథ్ సోమవారం ఉదయం పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవటంతోపాటు ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామి ఆలయ ఆదాయం రూ.3.04 లక్షలు

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో తొమ్మిది హుండీల్లోని కానుకలను లెక్కించినట్లు ఆలయ ఈఓ మాధవీలత తెలిపారు. హుండీల లెక్కింపు ద్వారా 61 రోజులకు గాను రూ.3,04,959 వచ్చినట్లు పేర్కొన్నారు. లెక్కింపును ఇన్‌స్పెక్టర్ అధికారి సువర్ణాదేవి, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు రామ్మోహనరావు పర్యవేక్షించినట్లు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు వంట సామగ్రి పంపిణీ



పమిడిముక్కల: వీరంకిలాకులోని అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ, ఎస్ఐ శ్రీనివాస్ కలిసి సోమవారం నిత్యావసరాలు, వంట సామగ్రి అందజేశారు. వీరంకిలాకు పీహెచ్‌సీ పక్కన ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పోతన రాజ్యలక్ష్మి, అన్నపురెడ్డి అప్పన్నకు చెందిన పూరిళ్లు దగ్ధమయ్యాయి. రెడ్‌క్రాస్ సొసైటీ వారు బాధిత కుటుంబాలను పరామర్శించి ఇంటిపైన కప్పుకునేందుకు టార్పాలిన్ పట్టాలు, వంట సామగ్రి అందజేశారు. ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది కలిసి రెండు కుటుంబాలకు రెండు బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ తోట బాలాజీ, కార్యదర్శి బవిరి శంకరనాథ్, డీటీ జోబాబు, ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంపీ బొల్లా గోపీ పాల్గొన్నారు.

బెంచీల ఏర్పాటు



మండవల్లి: హిందూ ధర్మ సమితి ఆర్థిక సాయంతో లింగాల, పెరికెగూడెం, అయ్యవారి రుద్రవరంలోని శివాలయాలు, స్థానిక స్టేషన్ రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం, అయ్యవారిరుద్రవరంలో పలుచోట్ల సిమెంట్ బెంచీలు సోమవారం ఏర్పాటు చేశారు. హిందూ ధర్మసమితి నిర్వాహకులు మాట్లాడుతూ మానవ సేవయే మాధవసేవ అనే సనాతన ధర్మ సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం



గుడివాడరూరల్: సార్వత్రిక ఎన్నికల విధుల నిమిత్తం గుడివాడ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఏవీ రామాంజనేయులు తిరిగి పశ్చిమగోదావరి జిల్లా బదిలీ కావడంతో గుడివాడ రెవెన్యూ ఉద్యోగులు సోమవారం రాత్రి ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు గూడపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనిల్, వీఆర్వోలు సుబ్బారావు, జరీనా, రాంబాబు పాల్గొన్నారు. కాగా ఇన్‌చార్జి తహసీల్దార్ డీటీ కిషోర్ ప్రస్తుతానికి వ్యవహరించనున్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు

పెదపారుపూడి: మండల తహసీల్దార్‌గా పనిచేసిన మాధవరావు సొంత జిల్లా తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం కార్యాలయంలో వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరిడెంట్ వాణి మాట్లాడుతూ కష్టపడి పని చేసే అధికారులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ సుందరరావు, వీఆర్వోలు భగవంతరావు, ప్రసాద్, దానియేలు, శ్రీనివాసరావు, వీఆర్ఏలు చుక్కామ్మ, లక్ష్మీ, సిబ్బంది గోపాల్, హరీష పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను పూర్తిస్థాయిలో తొలగించాలి



అడ్డాడ(పామర్రు): పామర్రు చానల్లో (లంకకాలువ)లో గుర్రపు డెక్క, తూడుకాడలను పూర్తి స్థాయిలో తొలగించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని పామర్రు చానల్లో తొలగింపు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్తి స్థాయిలో తొలగింపు చర్యలు చేపట్టి, స్థానిక రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు వల్లూరి పల్లి గణేష్, నాయకులు కేదారేశపల్లి శ్రీను, వీరాంజనేయులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.